రికార్డు స్థాయి సభ్యత్వాలు చేయించాలి

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ



సభ్యత్వ నమోదుకు హాజరైన బీజేపీ శ్రేణులు

నిజాంపేట్: కేంద్ర ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వాలు చేయించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. బాచుపల్లి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జరిగిన బీజేపీ మేడ్చల్–మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా సభ్యత్వ నమోదును మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా కన్వీనర్ మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నతమైన వృత్తిలో ఉన్నవారికి, వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు, యువత విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకాగా వారికి సభ్యత్వాలు అందజేశారు. అనంతరం ఎంపీ అరుణ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో 70 శాతం ఓటర్లు సభ్యులుగా చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ తనకు మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా అధిక ఓట్లు పడ్డాయో, అదే స్ఫూర్తితో ఇంటింటికీ తిరిగి పార్టీ సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కొల్లి మాధవి, జయ, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, నరహరి తేజ, విఘ్నేష్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, డివిజన్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

అటు కూల్చివేతలు.. ఇటు వేడుకోలు



కైసర్‌నగర్‌లో నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

గాజులరామారం డివిజన్‌లో మరోసారి అక్రమ నిర్మాణాల తొలగింపు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్, దేవేందర్‌నగర్‌లోని సర్వేనంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం ఆధ్వర్యంలో కైసర్‌నగర్‌లో 13 గదులు, 3 బేస్‌మెంట్లు, మంజూర్‌నగర్‌లో 2 గదులు, 5 గుడిసెలను జేసీబీతో తొలగించారు.

అధికారులతో వాగ్వాదం..

కూల్చివేతల సమయంలో స్థానిక మహిళలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీంతో తమ ఇల్లు ఎలా కూల్చుతారని వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

కూల్చొద్దంటూ వేడుకోలు..

పైసా పైసా పోగుచేసి ఇల్లు కట్టుకుంటున్నామని, కూల్చవద్దంటూ కొంతమంది మహిళలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వేడుకున్నారు. మరికొంతమంది జేసీబీకి అడ్డుగా నిల్చున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పలు నిర్మాణాలను నేలమట్టం చేశారు.

కరెంట్ మీటర్లపై ఆరా..

ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న గదులకు రోజుల వ్యవధిలోనే ఎలా కరెంట్ మీటర్లు ఇస్తున్నారని రెవెన్యూ అధికారులు ఆరా తీస్తున్నారు. కరెంట్ మీటర్లు ఇవ్వకుండా ఉంటే కబ్జాలను అరికట్టవచ్చని, సంబంధిత ఎలక్ట్రిసిటీ అధికారులకు లేఖ రాస్తామని వారు పేర్కొనారు.



తమ ఇల్లును కూల్చవద్దని ఆర్ఐని వేడుకుంటున్న దంపతులు

చౌకగా వస్తుందని కొనద్దు..



దళారులు ప్రభుత్వ స్థలంలో చేసిన ప్లాట్లను తక్కువ ధరకు వస్తుందని కొని మోసపోవద్దు. రెండు నెలల వ్యవధిలోనే 100 పైగా నిర్మాణాలను తొలగించాం. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కూల్చివేతలతో పాటు కేసులు కూడా నమోదు చేస్తాం.

–అబ్దుల్ రెహమాన్‌ఖాన్, తహసీల్దార్, కుత్బుల్లాపూర్

అశోక్ గౌడ్‌కు 'బంగారు నంది అవార్డు'

కుత్బుల్లాపూర్: ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఆర్. అశోక్ గౌడ్‌కు అవార్డు లభించింది. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బంగారు నంది అవార్డు– 2024'ను నగరంలో జరిగిన సమావేశంలో సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా అందుకున్నారు. మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లికి చెందిన అశోక్ మొదటి నుంచి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాడు. కరోనా సమయంలో పేదలకు అండగా నిలిచి గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేశారు.

మేడ్చల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడి నియామకం



దుండిగల్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా భౌరంపేటకు చెందిన గోనె మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఎంపీ ఈటల, జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, నేతలు విఘ్నేశ్వర్ చారి, పీసరి కృష్ణారెడ్డి, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి



కుత్బుల్లాపూర్: విద్యార్థి దశ నుంచే పర్యావరణాన్ని పరిరక్షణపై అవగాహన కల్పించాలని టీవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కోటిరెడ్డి అన్నారు. చింతల్‌లోని బీపీఎస్ ఒలంపియాడ్ స్కూల్‌లో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు



ఫిర్యాదును పరిశీలిస్తున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

జీడిమెట్ల: పరిశ్రమలకు చెందిన వాహనాలు రోడ్డుపై నిలిపితే చర్యలు తీసుకుంటామని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌నగర్ వెళ్లే రోడ్డులో రోడ్డుపైనే లారీలు పార్కింగ్ చేస్తున్నారని కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు ట్రాఫిక్, ఐలా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు చర్యలు తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లారు ఆయన వెంటనే బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మంగళవారం ఏసీపీ, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ, సిబ్బంది స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి పరిశ్రమల్లోకి వెళ్లి రోడ్డుపై వాహనాలు నిలపవద్దంటూ పరిశ్రమల యజమానులకు నోటీసులు ఇచ్చారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, పూర్ణచందర్ గుప్తా, గాలిహరిబాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ లైన్ నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ధూలపల్లి ఏఈ సురేందర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సూరారం గ్రామం, ఆర్‌జీకే 1,2, కృషి కాలనీ ఫీడర్ల పరిధిలో ఉ.10 నుంచి మ.2 గంటల వరకు బహదూర్‌పల్లి డబుల్ బెడ్రూం గృహసముదాయం, సూరారం రాజీవ్‌గృహకల్ప, మరాఠీ బస్తీ, మైత్రినగర్, సూరారం కాలనీ, తులసీ కన్‌స్ట్రక్షన్స్, గ్రీన్‌హిల్స్‌కాలనీ, సంతోష్‌నగర్, దయానంద్‌నగర్, సూరారం మార్కెట్, సుందర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



చింతల్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



జీడిమెట్ల డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని జీడిమెట్ల కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి వెన్నెలగడ్డలోని చెరువు దుర్వాసన, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో పాటు అధ్వానంగా మారిన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆమె పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కోర్మిల్ల సంజీవ్ రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, కృష్ణ, బీరప్ప, బాల మల్లేశ్, ఎశ్వంత్, మహేశ్, శ్రావణ్ గౌడ్, సందీప్ గౌడ్, మహేశ్ గౌడ్, మహేశ్, శ్యామ్, శివ పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్శితులై చేరిక



సుభాష్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ మర్యాద మహేశ్, వైస్ ప్రెసిడెంట్ ఎండీ అహ్మద్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు బాచుపల్లిలోని కార్యాలయంలో హన్మంతరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ లాయక్, అజయ్, గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ



కుత్బుల్లాపూర్: డెక్కన్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో హైదరాబాద్ పేరిట కులీకుతుబ్‌షా స్టేడియంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ – 2024 పోటీల్లో కుత్బుల్లాపూర్‌కు చెందిన నేతాజీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖోఖో అండర్–17, అండర్–14 బాలికల విభాగంలో మొదటి స్థానం, ఖోఖో అండర్–14 బాలురు మొదటి స్థానం పొందారు. అదే విధంగా షార్ట్ పుట్‌లో అండర్–12 బాలికల విభాగంలో కుమారి సిరివర్షకు మూడో స్థానం, అండర్–17 బాలికల విభాగంలో హిమషు ద్వితీయ, రన్నింగ్‌లో తనుజ మొదటి స్థానం, అండర్–17 బాలూర రన్నింగ్‌లో మానవ్ భాటి ద్వితీయస్థానాల్లో నిలిచారు. ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ మల్లేశం యాదవ్ అభినందించారు.



అమ్మవారి ప్రసాదం అందజేత

కుత్బుల్లాపూర్: మాజీ సీఎం కేసీఆర్‌ను కొంపల్లికి చెందిన దేవి ఉపాసకులు రాచర్ల రవిచంద్రశర్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం అమ్మవారి ప్రసాదాన్ని కేసీఆర్‌కు అందజేశారు.



కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలి

నిజాంపేట్: కార్పొరేషన్ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు వెంకటరామయ్య అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సౌజన్యను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు చంద్రశేఖర్, బాలవెంకటేశ్వరరావు, వెంకటరాజ్యం తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లేశ్

సుభాష్‌నగర్: మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు సహకరించాలని జీడిమెట్ల ఎస్ఐ మల్లేశ్ అన్నారు. గాజులరామారం తత్వా గ్లోబల్ స్కూల్‌లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఎందరో విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను కోల్పోయారని, తన యూట్యూబ్ చానల్ 'క్రైమ్ ఫ్రీ ఇండియా' ద్వారా నిరంతరం మాదక ద్రవ్యాల వాడకాన్ని నిరోధించేందుకు కృషి చేస్తునామన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తెలిసిన వారు మాదక ద్రవ్యాలు బానిసైతే వాటి నుంచి బయట పడేందుకు సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ విశ్వనాథ శివ స్వామి, ప్రిన్సిపాల్ శ్రీమతి పావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కుత్బుల్లాపూర్: రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖామంత్రి దామోదర రాజ నర్సింహను మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఉన్నారు.

కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌సీపురం సిరిసిల్క్ ప్రాంతానికి చెందిన బత్తిన శిరీష (28) నాలుగేళ్లుగా నానక్‌రాంగూడలోని క్యూ సిటీలో బ్యూటీషియన్‌గా పని చేస్తుంది. అక్కడే జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన హెయిర్ స్టైలిస్ట్‌గా పని చేస్తున్న దైద సూరజ్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారడంతో ఇరు కుటుంబాలకు ఒప్పించి గతేడాది పెద్ద సమక్షంలో వివాహం చేసుకున్నారు. కట్న కానుకల కింద రూ.2 లక్షలు, 5 తులాల బంగారం అప్పజెప్పారు. అయితే పెళ్లైన రెండు నెలల నుంచే అదనపు కట్నం కోసం భర్త, అత్త మామలు శిరీషను శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలు పెట్టారు. పలుమార్లు పెద్దల సమక్షంలో నచ్చజెప్పారు. అయినప్పటికీ వేధింపులు తీవ్రం కావడంతో ఈ నెల 9న రాత్రి శిరీష ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు విక్రమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

దుండిగల్: నిర్మాణంలోని భవనంపై నుంచి పడి కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లో దయాకర్ అనే వ్యక్తి 180 గజాల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. అక్కడే కుమ్మరి విట్టలయ్య అనే కార్మికుడు సెంట్రింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. రోజులాగే పనులు చేస్తుండగా మంగళవారం నాలుగో అంతస్తు పైన ఉన్న హై టెన్షన్ వైర్లు తగిలి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు



సుభాష్‌నగర్: బైక్ అదుపుతప్పడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాజులరామారం బతుకమ్మబండకు చెందిన యువకుడు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో దేవేందర్‌నగర్ నుంచి కైసర్‌నగర్ వెళ్తుండగా మార్గమధ్యంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.

కార్పొరేట్ సంస్థల సేవలు అభినందనీయం



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన భవనాల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ ఎండీ శ్రీనివాస్ సాధు, మేనేజింగ్ ట్రస్టీ కే రఘురామన్ సహకారంతో జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సూరారం కాలనీలో రూ.6 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్‌ను నిర్మించడంలో గురువులు, పాఠశాలలో సదుపాయాలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చంద్ర, పాఠశాల హెడ్ మాస్టర్ శిరీష, ఎంఆర్‌పీ రమేశ్, నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీనగర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి..

సూరారం డివిజన్ రాజీవ్ గాంధీనగర్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరయ్యారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. కార్యక్రమంలో సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, ఫాక్స్ డైరెక్టర్ పరిషే శ్రీనివాస్ యాదవ్, సూరారం డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్ధిఖీ, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం..

చింతల్ డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో ఏర్పాటుచేసిన 32 కెమెరాలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జీడిమెట్ల ఎస్ఐ ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ రఫీ, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, నాయకులు, మక్సూద్ అలీ, కేపీ వెంకటేశ్ గౌడ్, ఐస్వరాజ్ ఉన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

జగద్గిరిగుట్ట : రజక సంఘం ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్ వద్ద మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జగన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూస్వాములకు వ్యతిరేకంగా బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

భూదేవి హిల్స్‌లో..

భూదేవి హిల్స్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు జైహింద్ పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రజక సంఘం అధ్యక్షుడు నాగరాజు, మైలారం రాజు, గజం భాస్కర్, సతీశ్, సత్యనారాయణ. విఠల్, చంద్రమౌళి, రాజు, నాయకులు, పాపయ్య గౌడ్, విట్టల్ ముదిరాజ్, సంతోష్, ప్రభాకర్, యాదవ్, మహేందర్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు

గణనాథుడికి పూజలు..అన్నదానాలు



బహదూర్‌పల్లిలో కౌన్సిలర్ సత్యనారాయణ..

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో గణపతి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పలు మండపాల వద్ద వినాయకుడికి విశేష పూజలు.. అన్నదానాలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల గణనాథులను మేళా తాళాల మధ్య నిమజ్జనాలకు తరలించారు. పలువురు ప్రజాప్రతినిధులు, సంక్షేమసంఘాల నాయకులు గణనాథులను దర్శించుకుని పూజలు చేశారు.



బాచుపల్లి ఎస్సీకాలనీలో కొలన్ హన్మంత్‌రెడ్డి..



సుచిత్రలోని ప్రగతి ప్రైడ్ అపార్ట్‌మెంట్స్‌లో అన్నదానం



జగద్గిరిగుట్టలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్ జగన్